# పెళ్ళి పల్లకి

**అందరికీ** ముహూర్తాలు పెట్టే నరసింహశాస్త్రి తన కూతురికి కూడా లగ్నం పెట్టుకోగలుగుతాడని కలలో కూడా అనుకోలేదు. కలిసొచ్చే కాలం వస్తే నడిచొచ్చే కొడుకు పుడతాడంటారు. తన ఆర్థిక స్థితిగతులు అంతంత మాత్రంగా ఉన్నా తలుపు తట్టుకుని వచ్చిందో సంబంధం. ఇంతకూ అమ్మాయి అదృష్టవంతురాలన్నారు. కట్నాలు నింగికెగసిపోతున్న ఈ రోజుల్లో డబ్బుతో ప్రమేయం లేకుండా పరిణయ మాడతానంటూ ఓ యువకుడు ముందుకు రావడమేమిటి?

ఆరోజు

సుమిత్రకు ప్రదానం

పదిహేను రోజులలో కళ్యాణం

తాంబూలాల ఏర్పాట్లలో తలమునకలవుతూ, పెళ్లివారి రాకకోసం తలుపులు తీసుకుని కూర్చున్నాడు నరసింహశాస్త్రి.

★ ★ ★

శాస్త్రిగారికి ముగ్గురాడపిల్లలు. పెద్దమ్మాయి సుమిత్ర మూడోపదిలో అడుగుపెట్టి గుండెలమీద కుంపటిలా కూర్చుంది. ముహూర్తాలు పెట్టడం అతడి వృత్తి. శాస్త్రిగారు పెట్టిన ముహూర్తం ఎంతో బలమైందని అందరికీ గట్టి నమ్మకం. ముహూర్తాలు రాసిచ్చినందుకు ఎవరి తాహతుకు తగ్గట్టు వారు అంతో ఇంతో ముట్టజెబుతూ ఉంటారు. ఎవరినీ ఇంత ఇమ్మని కోరడు. సీజనులో రాబడి మెరుగ్గా ఉన్నా, ఉత్తిరోజుల్లో మాత్రం అతడి పాట్లు చెప్పనలవి కానివి. ఇంట్లోవాళ్ళు పస్తులున్నా అడపాతడపా బ్రాహ్మణోత్తానికి పోతూ వుండటం వల్ల తనకు మాత్రం విందుభోజనం లభిస్తుంది. ఇక దొరికిన దక్షిణ కూరగాయలకు కూడా సరిపోదు. ఇటువంటి పరిస్థితుల్లో అమ్మాయి పెళ్లేం చేస్తాడు? సుమిత్ర చక్కనిచుక్క కాకపోయినా పెళ్లికి కావలసిన అర్హతలన్నీ ఉన్నాయి. టెన్త్ పాసైంది. కుట్లు, అల్లికలు నేర్చుకుంది. ఇరుగు పొరుగు వారిచ్చే జాకెట్లు కుడుతూ పదో, పరకో ఆర్జిస్తోంది.

అరుగుమీద కూర్చుని పంచాంగం తిరగేస్తున్నాడు నరసింహశాస్త్రి.

"నమస్కారం" దగ్గరకొచ్చి చేతులు జోడించాడో యువకుడు. అతడికి ముప్ఫై ఏళ్లుంటాయి. స్ఫురద్రూపి. మోములో వినయం ఉట్టిపడుతోంది. పాలిస్టర్ సూట్లో శాస్త్రి కళ్లకు బాగా ఉన్నవాడిలా కనిపించాడతడు. తనవద్దకొచ్చిన వాళ్లంతా ముహూర్తాలు పెట్టించుకోడానికి తప్ప వేరొకందుకు రారని తెలుసు. మనిషిని చూడడంతోనే యాభై రూపాయల గిరాకీ తగిలిందని లోలోన సంబరపడ్డాడు. పాపం శాస్త్రికి ఆ నెలంతా గడ్డు నెలే. ముహూర్తాల కోసం ఒక్కరంటే ఒక్కరు కూడా రాలేదు.

వచ్చిన వ్యక్తివంక ఆశగా చూశాడు.

"నన్ను రాఘవ అంటారు. మీ ఇంటి ఓనరు జగన్నాథంగారి మేనల్లుడ్ని" స్వపరిచయం చేసుకున్నాడతడు.

"ఇంతకూ మీరు..."

"మీ ఫ్రెండ్ ఈ ఊళ్లో ఎవరో అమ్మాయి ఉందని, పెళ్ళిచూపులకు రమ్మని ఉత్తరం రాస్తే వచ్చాను. ఊరు వెళ్తున్నానని పసిగట్టిన మా మామయ్య మీ ఇంటికోమారు వెళ్లిరమ్మన్నారు"

"అలాగా లోపలకు రా నాయనా" అంటూ ఆహ్వానించాడు శాస్త్రి.

సుమిత్ర కాఫీ పట్టుకొచ్చింది.

"ఈ పిల్ల నా పెద్దకూతురు" పరిచయం చేశాడు నరసింహశాస్త్రి.

"నమస్కారం" కాఫీకప్పు అందుకున్నాడు రాఘవ.

పెళ్లి కొడుకుల వేటలో విసిగి వేసారిపోయిన శాస్త్రి, అతడు తన కూతుర్ని చేసుకుంటే బాగుండుననిపించింది. ప్చ్... తన భ్రమకాని, పైసా కట్నమివ్వలేని తన బిడ్డని ఎవరు మాత్రం ఎందుకు చేసుకుంటారు?

"గత నెల నుంచి మీరెందుకు అద్దె పంపడంలేదో కనుక్కుని రమ్మని...." విషయానికి వచ్చాడతడు.

"అనుకోని ఇబ్బందులు ఎదురయ్యాయి. త్వరలో పంపిస్తానని చెప్పండి" అన్నాడు శాస్త్రి అతడి మాట పూర్తి కాకుండానే.

"బాబూ పెళ్లి చూపులకు వచ్చానన్నావ్. అమ్మాయి నచ్చిందా?" ఉండబట్టలేక అడిగింది శాస్త్రిగారి శ్రీమతి శకుంతలాదేవి.

"ఏం చెప్పమంటారు? అమ్మాయి బాగా పొట్టిగా ఉంటుంది. నాకు కట్నంతో ప్రమేయం లేదు. పిల్ల నచ్చితే తాళి కట్టేద్దామనుకున్నాను. అందుకు మా అమ్మగారి అంగీకారం కూడా లభించింది. అయితే ఇంతవరకు నాకు నచ్చిన అమ్మాయి తటస్థపడలేదు. ఏమిటోనండి అర్థాంగి అన్వేషణలో తిరిగినంతగా నేను ఉద్యోగాన్వేషణలో కూడా తిరగలేదేమో!"

రాఘవ మాటలకు శాస్త్రి కళ్లు పెద్దవయ్యాయి. అంత వరకు అతడిలో నిద్రాణంగా ఉన్న ఆశ ఇప్పుడు బయటకు తన్నుకొచ్చింది.

"చూడు బాబూ, మా సుమిత్రను చూశావు కదా. నీకు నచ్చితే చెప్పు ఈ నెలలో మంచి ముహూర్తాలున్నాయి" అన్నాడు శాస్త్రి అతడివంక ఆశగా చూస్తూ.

తండ్రి మాటలకు సిగ్గు ముగ్గైంది సుమిత్ర. మరి అతడిచెంత నిలువలేక లోపలికెళ్లి పోయింది.

"చూశారా, మీకింత చక్కని అమ్మాయి ఉందని మాటవరసకైనా మామయ్య ఎన్నడూ అనలేదు. ఔను ఎందుకంటాడు? ఎలాగో అలాగ తన మెల్లకన్ను కూతుర్ని నాకు అంటగట్టాలని కదా అతడి తాపత్రయం"

రాఘవ మాటలకు శాస్త్రి దంపతుల హృదయాలలో ఉత్పన్నమైన ఆశాలత పుష్పించి ఫలించడానికి సిద్ధమైంది.

సుమిత్ర పెళ్లి రాఘవతో అయిపోవడం ఖాయమనుకున్నారు.

"విశాఖపట్నం వచ్చి మీ మామయ్యగారితో మాట్లాడతాను" అన్నాడు నరసింహశాస్త్రి వచ్చిన అవకాశం ఎక్కడ చేజారిపోతుందోనన్న బెదురుతో.

"వద్దండి. మా మామయ్యకు తెలిస్తే ఈ సంబంధం అవకుండా ఉండేందుకు సర్వవిధాలా కృషిచేస్తాడు. గురువారం నేనూ, మా అమ్మగారు వస్తాం. తాంబూలాలకు సిద్ధంగా ఉండండి" అనిచెప్పి వెళ్ళిపోయాడు రాఘవ.

అప్పనంగా అల్లుడు దొరుకుతున్నందుకు ఊరంత సంబరపడిపోయారు శాస్త్రిదంపతులు.

వారి సంభాషణ చాటుగా విన్న సుమిత్ర మదిలో పెళ్లిపల్లకి మెదిలింది. నాదస్వరం చెవుల్లో ప్రతిధ్వనించింది. మనసు ఊహాలోకాల్లో తేలిపోసాగింది.

★ ★ ★

అనుకున్నట్టుగానే రాఘవ తల్లిని తీసుకుని శాస్త్రిగారింటికి వచ్చాడు.

కుశల ప్రశ్నలయ్యాయి.

ఫలహారాలు పెట్టి సకల మర్యాదలు చేసింది శకుంతలాదేవి.

పళ్లెంలో అరటిపళ్లు, తమలపాకులు పెట్టి పట్టుకొచ్చాడు శాస్త్రి.

కొడుకును పక్కకు పిలిచి చెవులు కొరికింది రాఘవ తల్లి.

ఆమె ఆంతర్యం అర్థంకాక అయోమయంగా చూశారు శాస్త్రి దంపతులు.

"మరేం లేదండి. కట్న కానుకలు ఏలానూ లేవు. కనీసం ప్రదానం నాడైనా ఓ ఉంగరం, రిస్టువాచీ లాంటివేవీ కొనిపెట్టకుండా ఏం బావుంటోందంటోంది మా అమ్మ" అన్నాడు రాఘవ.

కట్నం పుచ్చుకోని అబ్బాయి దొరకడమే బహు అరుదు. ఇప్పుడీ అవకాశం చేజార్చుకుంటే ఇహ సుమిత్రకెప్పుడూ పెళ్లి చేయలేదు. అందుకే ఉన్నపళంగా భార్యమెడలోని పుస్తెల్ని, చెవులకున్న దుద్దుల్ని ఊడబెరికి రాఘవ కోరిక మేరకు ఉంగరం, రిస్టువాచీ పట్టుకొచ్చి ప్రధాన కార్యక్రమం పూర్తిచేసి ఊపిరి పీల్చుకున్నాడు.

"ఇక పెళ్ళికి ముహూర్తం పెట్టే బాధ్యత మీదే".

"అదెప్పుడో అయిపోయిందమ్మా. ఈ నెల ఇరవై ఐదో తేదీ బుధవారం రాత్రి ఎనిమిది గంటల ఇరవై ఘడియలకు బ్రహ్మాండమైన ముహూర్తం ఉంది" అన్నాడు శాస్త్రి.

"సరే ఇక మేం వెళ్లొస్తాం. మీ ఏర్పాట్లలో మీరుండండి అంటూ లేచింది రాఘవ తల్లి.

"ఈ నాలుగొందలు మామయ్యగారికిచ్చి అద్దెకింద జమకట్టుకోమను బాబు" అంటూ డబ్బు రాఘవ చేతిలో పెట్టాడు నరసింహశాస్త్రి.

"అలాగే" అన్నాడు రాఘవ నమ్రతగా.

★ ★ ★

వారం రోజుల తర్వాత...

నరసింహశాస్త్రి భోజనం చేసి, తుంగచాప మీద కూర్చుని భుక్తాయాసం తీర్చుకుంటుండగా, పోస్ట్‌మాన్ కవరొకటి ఇచ్చి వెళ్లిపోయాడు.

రాఘవ ఉత్తరం రాసివుంటాడు. ఏం రాశాడో? అనుకుంటూ కళ్లజోడు తగిలించుకుని ఉత్తరంలోకి దృష్టి సారించాడు.

అది ఇంటి యజమాని జగన్నాథం రాసిన లేఖ.

గతనెల అద్దె పంపలేదు. ఈ ఉత్తరం అందిన తక్షణం అద్దె పంపకపోయినట్లయితే ఇల్లు ఖాళీ చేయవలసి ఉంటుంది" అన్నది ఉత్తరం సారాంశం.

"ఐతే రాఘవ ద్వారా పంపిన సొమ్ము ఆయనకు చేరలేదా?" అనుమానం వ్యక్తం చేసింది శకుంతలాదేవి.

"అదే నాకూ అర్థంకావడం లేదు. అద్దె కట్టేయమని రాఘవకు డబ్బిచ్చి వారం రోజులు దాటింది. ఇంతవరకు ఆ సొమ్ము జగన్నాథానికి చేరకపోవడమేమిటి?" ఆశ్చర్యం ప్రకటించాడు శాస్త్రి.

అంతలో "బాబాయి గారూ! ఇదిగో పేపరు" అంటూ దినపత్రిక పట్టుకొచ్చి ఇచ్చాడు ఎదురింటబ్బాయి.

అప్రయత్నంగా పేపర్లోకి దృష్టి సారించాడు నరసింహశాస్త్రి. ఉసిరికాయంత అక్షరాలతో మొదటి పేజీలో ఉన్న ప్రకటన చూసి కొయ్యబారిపోయాడు.

"ప్రదానం పేరుతో ప్రతిచోటా కానుకలు స్వీకరించి పరారవుతున్న ఈ ఫోటోలోని వ్యక్తి ఆచూకీ తెలియజేసిన వారికి తగిన బహుమతి లభిస్తుంది"

పేపర్లో పోలీసు కమీషనర్ ప్రకటన, రాఘవఫోటో చూసి కళ్లు తేలేశారు శాస్త్రి దంపతులు.

సుమిత్ర కళ్ళల్లో కదలాడే పెళ్లిపల్లకి తునాతునకలైంది.

**(15-3-1997 ఆంధ్రప్రభ డైలి)**